28082024-DIS-04_Layout 1 8/28/2024 3:41 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఉక్రెయిన్ సమస్య

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జరిపిన ఉక్రెయిన్ పర్యటనకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. సోవియట్ యూనియన్ నుంచి ఉక్రెయిన్ విడిపోయి స్వతంత్రం ప్రకటించుకున్న తర్వాత భారత ప్రభుత్వాధినేత ఆ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్‌పై రష్యా రెండేండ్లకు పైగా భీకర యుద్ధం జరుపుతున్న సంగతి తెలిసిందే. మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లదీమిర్ పుతిన్‌ను ఆలింగనం చేసుకున్నట్టుగానే కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వలోదమర్ జెలెన్‌స్కీని మోదీ కావలించుకున్నారు. యుద్ధం వల్ల అష్టకష్టాలు పడుతున్న ఉక్రెయిన్ ప్రజలకు సానుభూతి తెలిపారు. యుద్ధం ద్వారా ఏ సమస్యా పరిష్కారం కాదని హితవచనం పలికారు. ప్రధాని మోదీ తన పర్యటనను ముగించుకొని ఢిల్లీకి తిరుగుపయనమైన కొద్దిసేపటి తర్వాత జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రెండు దేశాల సంబంధాల్లో ఏర్పడిన అగాధాన్ని ఇది సూచిస్తున్నది.

మన దేశానికి చైనాతో గల సరిహద్దు వివాదాన్ని జెలెన్‌స్కీ మీడియా సమావేశంలో పరోక్షంగా ప్రస్తావించడం అభ్యంతరకరమే. ఉక్రెయిన్‌పై పుతిన్ దాడి చేయడం సరైనదే అయితే మరోచోట చైనా చేసేదీ సబబే అవుతుందన్నట్టుగా జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలు భారత్‌కు ఏ మాత్రం ఆమోదయోగ్యం కావు. ప్రస్తుతం ఎడతెగకుండా కొనసాగుతున్న యుద్ధానికి పరిష్కారం కనుగొనడంలో భారత్ పాత్ర అంతంత మాత్రమేనని కూడా జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. యుద్ధంలో రెండు వైరి పక్షాలను ఏకకాలంలో మెప్పించడం దుస్సాధ్యమని ఈ ఉదంతం మరోసారి రుజువు చేసింది. గత నెల మాస్కోలో పుతిన్‌ను మోదీ కావలించుకున్న సమయంలోనే ఉక్రెయిన్‌పై రష్యా భారీ క్షిపణి దాడులు జరిపింది. ఈ దాడుల్లో అనేకమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఆ సందర్భంలోనూ జెలెన్ స్కీ భారత్‌పై విమర్శలు చేయడం వివాదాస్పదమైంది.

2022లో రష్యా ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధం మొదలుపెట్టినప్పుడు పశ్చిమదేశాలు రష్యాపై తీవ్రమైన ఆంక్షలు విధించాయి. భారత్ మాత్రం రష్యా నుంచి దిగుమతులు పెంచి ఆంక్షలను బేఖాతరు చేసింది. పశ్చిమదేశాలు ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వెలివేసిన రష్యా నుంచి భారత్ పెద్దఎత్తున చమురు చౌకగా దిగుమతి చేసుకుంటున్నది. గత జూలై నాటికి చైనాను దాటేసి అతిపెద్ద దిగుమతిదారుగా భారత్ నిలవడం విశేషం. భారత్‌లోని కొన్ని కార్పొరేట్ కంపెనీలు ఈ దిగుమతుల ద్వారా భారీగా లబ్ధి పొందుతున్నాయనే ఆరోపణలున్నాయి. సహజంగానే ఉక్రెయిన్ యుద్ధరంగంలో తమ శత్రువైన రష్యాకు సన్నిహిత మిత్ర దేశమైన భారత్ ఆపన్నహస్తం అందించడంగానే దీన్ని చూస్తున్నది. జెలెన్‌స్కీ కటువైన మాటల్లో ఇది విస్పష్టంగా వ్యక్తమైంది. తదుపరి శాంతి శిఖరాగ్రసభ భారత్‌లో జరిగితే బాగుండునని ఆయన సూచించడం ఆలోచించాల్సిన విషయం. మాజీ సోవియట్ రిపబ్లిక్‌ల విషయంలో భారత్ తన దౌత్య విధానాలను పునఃపరిశీలించుకోవాలని ఉక్రెయిన్ సమస్య తెలియజేస్తున్నది. చిత్తశుద్ధితో సమదూరం పాటిస్తూ, నిజమైన అలీన విధానం అవలంబిస్తేనే శాంతికాముక దేశంగా భారత్ పేరు సార్థకమవుతుంది.

హైడ్రా పేరిట.. కాంగ్రెస్ అరాచకం

కారుపోతుల పాండరి గౌడ్
70138 24056

హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్).. విశ్వనగరం హైదరాబాద్ పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేశామని చెప్తున్న సంస్థ ఇది. అయితే ఏర్పాటైన నాటి నుంచి ఈ సంస్థ తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు, గిట్టనివారు, పేదలపై మాత్రమే హైడ్రా దూకుడు ప్రదర్శిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. చెరువుల పరిరక్షణ పేరిట ప్రత్యర్థులను కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ చేస్తున్నదా? సెటిల్‌మెంట్ల కోసమే కూల్చివేతలకు పాల్పడుతున్నదా? హైడ్రాతో నగరంలోని సామాన్యుడి జాగా సురక్షితమేనా? అన్న ప్రశ్నలు ఇప్పుడు అందరి మదిని తొలిచివేస్తున్నాయి.

హైదరాబాద్.. ఘన చరిత్ర కలిగిన విశ్వనగరం. వెయ్యి సరస్సుల సమాహారం. జంట జలాశయాలు, మూసీ, మంజీరా నదులు, నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్.. ఇలా చెప్పుకొంటూపోతే భాగ్యనగరానిది ఒడువని ముచ్చట. అలాంటి నగరంపై కాంగ్రెస్ సర్కార్ కుట్రలకు తెరలేపుతున్నది. హైడ్రా పేరిట హైడ్రామా చేస్తున్నది. 50 ఏండ్ల తమ పాలనలో చెరువులను చెరబట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు చెరువుల పరిరక్షణ అని నాటకాలు వేస్తుండటం విడ్డూరం. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్న 1982-2012 మధ్యకాలంలో హైదరాబాద్‌లో మాయమైన చెరువుల సంఖ్య అక్షరాలా 375. అన్యాక్రాంతమైన చెరువు శిఖాలు, భూములు కొన్ని వేల ఎకరాలు. గ్రామీణ ప్రాంతాలను పట్టించుకోకపోవడంతో వలసలు పెరిగి నగరం విధ్వంసానికి గురైంది. గత మూడు దశాబ్దాల్లో చెరువుల్లో వెలిసిన అనేక కాలనీలను మనం చూశాం. ఉమ్మడి పాలనలోనే జంట జలాశయాలు ఆక్రమణకు గురయ్యాయనేది జగమెరిగిన సత్యం. అప్పటి పాలకుల అండతో, రాజకీయ పలుకుబడితో నిబంధనలను తుంగలో తొక్కి జంట జలశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు వెలిశాయి.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. అందులో భాగంగానే హైడ్రాను ఏర్పాటు చేసింది. పరిరక్షణ పేరిట చెరువు భూములపై నజర్ వేసింది. సెటిల్‌మెంట్లకు తెరలేపింది. ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి అనుకూలమైన బడాబాబుల జోలికి వెళ్లకుండా.. ప్రతిపక్ష నేతలు, తమకు సహకరించనివాళ్లే లక్ష్యంగా కూల్చివేతలకు పాల్పడుతున్నది.

గత ప్రభుత్వం అక్రమ కట్టడాలపై చర్యలకు పూనుకున్నది. కానీ, ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన స్టేలు అడ్డంకిగా మారాయి. రేవంత్ సర్కార్ మాత్రం నిబంధనలు, స్టేలు జాన్తా నై అంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నది. వ్యక్తిగత కక్షతో ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసి తమకు ఎవరైనా ఒక్కటేనని గప్పాలు కొట్టుకుంటున్న హైడ్రా.. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ఆక్రమణల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇదంతా చూస్తుంటే ఓ ప్రణాళిక ప్రకారమే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతున్నది.

సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ నేతృత్వంలో ఏర్పడిన హైడ్రా ముందు పలు సవాళ్లున్నాయి. చెరువులు, కుంటల కబ్జాల కారణంగా 60 ఏండ్లలో హైదరాబాద్ చాలా విధ్వంసమైంది. అక్రమ నిర్మాణాలను కూల్చాలంటే సగం హైదరాబాద్‌ను నేలమట్టం చేయాల్సి ఉంటుంది. ఇక్కడే హైడ్రా విశ్వసనీయత ఏమిటనేది తెలుస్తుంది. నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన గత ప్రభుత్వం 118 జీవో ద్వారా వందలాది పేదల ఇండ్లను రెగ్యులరైజ్ చేసింది. అయితే కాంగ్రెస్ సర్కార్ మాత్రం అలాంటి పేదలను టార్గెట్ చేస్తుండటం శోచనీయం. భారీగా పోలీసు బలగాల మధ్య పేదలు, సామాన్యుల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నది. హైడ్రాను ముందు పెట్టుకొని పేదల జాగలపై కన్నేసింది. దీంతో హైడ్రా దెబ్బకు సామాన్యుడి నడ్డి విరగడం ఖాయంగా కనిపిస్తున్నది. కాయకష్టం చేసి కట్టుకున్న ఇల్లు, పైసా పైసా కూడబెట్టి కొనుకున్న ప్లాట్‌కు గ్యారంటీ లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో బడాబాబులకు వర్తించని నిబంధనలను పేదలకు వర్తింపజేయడం సరికాదు.

అనేక విమర్శలను ఎదుర్కొంటున్న హైడ్రా ముందు పలు సవాళ్లున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న చెరువులెన్ని? వాటి విస్తీర్ణమెంత? ఏ చెరువు ఎంత మేరకు కబ్జాకు గురైంది? కబ్జాదారులు ఎవరు? ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న కొన్ని నిర్మాణాలనే ఎందుకు కూలుస్తున్నారు? కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత నిర్మాణం మొదలైన వాటిని కూలుస్తారా? విస్మరిస్తారా? అనుమతి ఇచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? లాంటి అనేక ప్రశ్నలకు హైడ్రా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

ఇలా అనేక విమర్శల మధ్య హైడ్రా దూకుడు కొనసాగుతుండగానే.. దాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నది. హైడ్రాకు పోలీస్ స్టేషన్ హోదా ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. దీనివల్ల నేరుగా హైడ్రానే ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు వీలు కలుగుతుంది. ఇక హైడ్రా కూల్చివేసిన భవనాలకు గతంలో అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకునే విషయమై ఉన్నతాధికారులతో ప్రభుత్వం చర్చలు జరపనున్నట్టు తెలుస్తున్నది. అయితే ఒక్క ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తప్ప హైడ్రా కొత్తగా సాధించిందేమీ లేదు. మరోవైపు పెద్దలను వదిలిపెట్టి, పేదలపై జులుం ప్రదర్శించడంపై ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. దీనిపై ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్యుల నిర్మాణాల జోలికొస్తే ప్రజలు తిరగబడటం ఖాయం.

హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న చెరువులెన్ని? వాటి విస్తీర్ణమెంత? ఏ చెరువు ఎంత మేరకు కబ్జాకు గురైంది? కబ్జాదారులు ఎవరు? ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న కొన్ని నిర్మాణాలనే ఎందుకు కూలుస్తున్నారు? కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత నిర్మాణం మొదలైన వాటిని కూలుస్తారా? విస్మరిస్తారా? అనుమతి ఇచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? లాంటి అనేక ప్రశ్నలకు హైడ్రా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

బాధ్యతారాహిత్యం.. బానిస భావం

శ్రీ శ్రీ కుమార్

రాష్ట్రంలో సుమారు తొమ్మిది నెలల కిందట అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు హామీల అమలు పేరుతో గొప్పలు చెప్పు కొంటూ కాలం వెళ్లదీస్తున్నది.

గత ప్రభుత్వంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకుగాను కోట్ల రూపాయల ఖర్చు చేసి హంగులు, ఆర్భాటాలు ప్రదర్శించిన కాంగ్రెస్, తమ ప్రభుత్వమే వారికి పరీక్ష నిర్వహించి, ఎంపిక చేసి నియమించుకున్నట్టుగా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపికైన అభ్యర్థులకు కేవలం నియామక పత్రాలిచ్చి చేతులు దులుపుకొన్నదనే అసలు వాస్తవం అభ్యర్థులకు, వారి కుటుంబాలకు తెలుసు. 2023, జూలై, ఆగస్టుల్లోనే నియామకాలు జరిగాయి. వారి జీతభత్యాలకయ్యే ఖర్చుతో ప్రభుత్వం ప్రకటనల పేరిట పబ్బం గడుపుకోవడం నిజంగా విడ్డూరం.

ఇదిలా ఉంటే.. గత పదేండ్లుగా టీఎస్ అని చలామణిలో ఉండగా దానిని పనిగట్టుకొని కాంగ్రెస్ సర్కార్ టీజీ అని మార్చి గొప్ప పాలనా సంస్కరణను ప్రవేశపెట్టింది. వాస్తవానికి టీజీ అని మార్చడం 'తెలంగాణ' అనే పదాన్ని విడదీయడమే. అప్పుల రాష్ట్రమని పదే పదే పేర్కొంటూనే దానికోసం అందుకు దాదాపు రూ.2,800 కోట్లు ఖర్చు చేసింది. ఇక గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన ప్రాజెక్టులను తామే నిర్మించినట్టు గొప్పగా ప్రకటనలు ఇచ్చుకొని ప్రారంభించి ఆడంబరాలు చేస్తున్నది.

ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ప్రతిపక్ష శాసనసభ్యులను ఆకర్షించడానికే తమ శక్తియుక్తులను ధారపోస్తూ వారిని ఎన్ని కోట్లు పెట్టి కొనడానికైనా సిద్ధంగా ఉన్నారనే ప్రచారం నడుస్తున్నదంటే ఇది కాంగ్రెస్ బాధ్యతారాహిత్యం కాక మరేమవుతుంది? తమ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందోననే అభద్రతా భావం వారిని ఇంకా వెంటాడుతున్నది. అయితే, కాంగ్రెస్ నాయకులు ఒక విషయం మరిచిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలను ఎవరూ కూల్చవలసిన అవసరం లేదు. తమకు తామే కూలుకునే గొప్ప సంస్కృతి ఆ పార్టీ సొంతమని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నా.

ఓ పక్క బజారులో తిరిగే కుక్కల వల్ల మనుషుల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. కుక్కకాటుకు చిన్నారుల ప్రాణాలు పోతుండటం శోచనీయం. మరోపక్క డెంగీ, విషజ్వరాలు ప్రజల ఆరోగ్యం తో ఆటలాడుకుంటున్నాయి. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరం. పాలనపై మంత్రులకు పట్టులేకపోవడమే ఇందుకు కార ణం. ఇక అనేక యాజమాన్యాల కింద నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో మరణ ఘంటికలు మోగుతున్నాయి. ఇంతకాలం వాటికున్న ఆదరణ, గౌరవం ఇప్పుడు సన్నగిల్లాయనడంలో సందేహం లేదు.

వరదలతో హైదరాబాద్ నగర జీవనం అస్తవ్యస్తమవుతున్నా మంత్రులు, అధికారులు నగరంలోని బస్తీలను పర్యటించే ప్రయత్నం చేయలేదు. మేమున్నామనే భరోసా వారికి కల్పించలేదు. కానీ, రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలకు హాజరుకావడం వారికి ప్రజల పట్ల ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. సోనియాగాంధీ కుటుంబం పట్ల కాంగ్రెస్ నాయకులు తమ భక్తిప్రపత్తులు చాటుకొని బానిసత్వాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు, అధికారులు బస్తీలు పర్యటించి వరద బాధితులకు తోడుగా నిలవడాన్ని ఇప్పటికీ మరిచిపోలేం. కానీ, కాంగ్రెస్ పాలకులకు అవేమీ పట్టడం లేదు. పాలనానుభవం, యంత్రాంగంపై పట్టు లేకపోవడం ప్రతి విషయంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. మన కాంగ్రెస్ హీరోలు అభినవ నీరోలు అని నిరూపించారు.

రాష్ట్ర సచివాలయం వద్ద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకయైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించకుండా రాష్ట్ర ఏర్పాటుకు సంబంధం లేని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని నెలకొల్పాలనుకోవడం అవివేకం, అర్థ రహితం. తెలంగాణ ఉద్యమస్ఫూర్తి కొరవడిన వారు మాత్రమే ఆ విధంగా ప్రవర్తిస్తారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర వహించి పదేండ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడిపై ముఖ్యమంత్రి రేవంత్ అవాకులు చెవాకులు పేలడం ఆక్షేపణీయం. కమ్యూనిస్టులకు కమిట్‌మెంట్ ఎక్కువ. తమతో ఎన్నికల ఒప్పందం కుదుర్చుకున్న పార్టీ ప్రభుత్వం ఎన్ని తప్పులు చేస్తున్నా వారు నోరు మెదపడం లేదు.

రాజులు శాశ్వతం కాదు. అట్లాగే రాజ్యం, ప్రభుత్వం కూడా శాశ్వతం కావు. కానీ, రాజు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలవాలి. ప్రతిష్ఠకు, పట్టింపులకు పోకూడదు. కేంద్ర ప్రభుత్వం ల్యాటరల్ ఎంట్రీపై విపక్షాల దాడితో యూటర్న్ తీసుకున్నది. సచివాలయం ఎదురుగా విగ్రహం విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకోవడం మంచిది. లేదంటే ప్రజాగ్రహాన్ని చవి చూడవలసి వస్తుంది. ఈ విషయమై అనేకమంది మేధావులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాలు కూడా పత్రికల ద్వారా తమ వినతిని, నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజాహితమే పరమావధిగా ప్రభుత్వం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఈబీసీ రిజర్వేషన్లు సాధించాల్సిందే!

యెనుగందుల శంకర్
94407 47614

2021లో జీవో నెంబర్ 33 ద్వారా అగ్రకుల పేదల(ఈడబ్ల్యూఎస్)కు తెలంగాణ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఒకరికి మోదం మరొకరికి ఖేదం అన్నట్టయింది. తమిళనాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కలిపి 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టే.. తెలంగాణలోని ఈబీసీలకు కూడా రిజర్వేషన్లు వర్తింపజేయడం అత్యంత ఆవశ్యకం. కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఈబీసీ రిజర్వేషన్లను సాధించాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉన్నది.



103వ రాజ్యాంగ సవరణ ద్వారా 2019 జనవరి 12న ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. లోక్‌సభలో 323 -3 ఓట్ల తేడాతో, రాజ్యసభలో 165 -7 తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. అయితే ఆ సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పార్లమెంట్ సభ్యుల్లో ఒక్కరూ నోరు మెదపలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15లో ఇప్పటికే ఉన్న 5 నిబంధనలకు అదనంగా మరో నిబంధనను చేర్చిన కేంద్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలను వంచించింది. 15(6)ఏ లో ప్రస్తావించిన వర్గాలకు కాకుండా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకునే వెసులుబాటు దీని ద్వారా ప్రభుత్వానికి కలిగింది. నిబంధన (బీ) ప్రకారం.. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఆర్థికంగా బలహీనవర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి. 16(6)లో 4వ నిబంధనలో పేర్కొన్న వర్గాలకు కాకుండా అదనంగా ఈబీసీ వర్గాలకు కేటాయించాలని పేర్కొన్నారు. 16(4)లో ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేని సామాజికవర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఉంది. కానీ, కొత్త క్లాజులో ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలు అనే మాటను తొలగించారు.

రాజ్యాంగంలో 340 అధికరణం వెనుకబడిన తరగతులకు, 341 షెడ్యూల్డ్ కులాలకు, 342 షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన పరిస్థితులను అధ్యయనం చేయడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ అధికరణంలో పేర్కొన్న వర్గాలకు మినహా మరే ఇతర వర్గాలకు రిజర్వేషన్ల హక్కు కల్పించడమంటే కులాన్ని శాశ్వతీకరించి అగ్రకులాలు మరింత ఉన్నతంగా వర్ధిల్లేందుకు తోడ్పడటమే. సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపి సమానత్వాన్ని సాధించడానికి ఎన్నుకున్న మార్గమే రిజర్వేషన్లు. కులాల మధ్య ఉన్న సామాజిక అసమానతలను తొలగించడానికి సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మన రాజ్యాంగం రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. అంతేతప్ప, ఆర్థిక వెనుకబాటుతనానికి కాదు. ఆర్థిక వెనుకబాటుతనాన్ని రూపుమాపాలంటే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రిజర్వేషన్లు అనేవి ఒక సంక్షేమ పథకం కాదు.

1953 జనవరి 20న కాకా కాలేల్కర్ నేతృత్వంలో 11 మంది సభ్యులతో కూడిన కమిషన్‌ను అప్పటి రాష్ట్రపతి నియమించారు. ప్రభుత్వానికి ఈ కమిషన్ పలు సూచనలు చేసింది. దేశంలోని ఏ వర్గానికి చెందినవారైనా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయా వర్గాలను నిర్ధారించడం, ఆయా వర్గాల జాబితాను తయారు చేయడం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సామాజికవర్గాల జీవన స్థితిగతులను, వారి సమస్యలను అర్థం చేసుకొని ఆ స్థితిగతులను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలను సూచించడం. సైన్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఇతర టెక్నికల్ కోర్సులు, సంబంధిత విద్యాసంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 70 శాతం రిజర్వేషన్లు కల్పించడం. సీట్ల కేటాయింపుల్లో అత్యంత వెనుకబడినవర్గాల పిల్లలకు ముందు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రభుత్వ ఉద్యోగాలనేవి ప్రజలకు ఒక రకమైన సామాజిక హోదా, గుర్తింపు, విలువ, అధికారం, వేతనాలు, ఆర్థిక, ఉద్యోగపరమైన భద్రత కల్పిస్తాయి. కాబట్టి, వారికి రిజర్వేషన్లు కల్పించడం. స్థానిక సంస్థల సర్వీసుల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఉండాలని కమిషన్ సూచించింది. ఈ కమిషన్ తన నివేదికను 1955 మార్చి 30న నాటి రాష్ట్రపతికి సమర్పించింది. ఆ తర్వాత వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం రెండో కమిషన్ ఏర్పాటైంది.

1979లో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వం మండల్ కమిషన్‌ను నియమించింది. సాంఘిక, ఆర్థిక, విద్యాపరమైన 11 సూచికల ఆధారంగా వెనుకబాటుతనాన్ని మధించేందుకు పనిచేసిన ఈ కమిటీకి బీపీ మండల్ నేతృత్వం వహించారు. 1980 డిసెంబరు 31 నాటికి మండల్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. కులం, ఆర్థిక, సామాజిక అంశాల ఆధారంగా 1980 నాటికి దేశ జనాభాలో 52 శాతం మంది ఓబీసీలు (ఇతర వెనుకబడ్డ కులాలు) ఉన్నట్టు గుర్తించింది. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, పబ్లిక్ సెక్టార్ సంస్థల్లోనూ 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ఈ 27 శాతాన్ని కలిపితే మొత్తం రిజర్వేషన్లు 49 శాతానికి చేరతాయి.

10 శాతం అగ్రకుల రిజర్వేషన్ల విషయం కనుమరుగు కావడానికే ప్రస్తుతం ఓబీసీ వర్గీకరణను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. 56 శాతం మంది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'మేమెంతో మాకంతా' నినాదంతో రిజర్వేషన్ ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడటం తథ్యం.

10 శాతం అగ్రకుల రిజర్వేషన్ల విషయం కనుమరుగు కావడానికే ప్రస్తుతం ఓబీసీ వర్గీకరణను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. 56 శాతం మంది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'మేమెంతో మాకంతా' నినాదంతో రిజర్వేషన్ ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడటం తథ్యం.



ఎఫ్ఐఆర్‌లో వాళ్ల పేర్లు కూడా చేర్చాలి!

ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ తయారీ కాంట్రాక్ట్‌ను తన కుమారుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే స్నేహితుడైన జైదీప్ ఆప్టేకు సీఎం ఏక్‌నాథ్ షిండే కట్టబెట్టారు. ఆప్టే వయస్సు 24 ఏండ్లు మాత్రమే. అలాంటి భారీ విగ్రహాలు తయారు చేయడంలో అతనికి అనుభవమే లేదు. సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్, పీడబ్ల్యూడీ మంత్రి పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చాలి.

- ప్రియాంక చతుర్వేది, శివసేన (యూబీటీ) ఎంపీ